క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారెంపూడి: మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ శాఖ ఏఈ కె.కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వినుకొండ రోడ్డులోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనుల నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా నాగమణి



మాచర్ల: రాష్ట్రంలో ప్రతి మహిళ అభివృద్ధికి, పేద మహిళల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు చేపట్టారని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నూతనంగా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించిన ఆదిరాల నాగమణికి నియామక పత్రం అందించారు. రాబోయే రోజుల్లో పట్టణంలో ప్రతి మహిళను చైతన్యం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, ఎస్సీ విభాగ పట్టణ నాయకులు కందుకూరి రత్నరాజు, కంభంపాటి మోషే, శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

పిన్నెల్లిలో పోలీస్ కవాతు



మాచవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి దుస్సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీస్ కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఎస్‌కే అమీనుద్దీన్ తెలిపారు. మండలంలోని పిన్నెల్లి గ్రామంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సాయుధ బలగాలతో ఆదివారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిపించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ నియమావళిని ఎవరైనా అతిక్రమిస్తే చట్ట పరంగా చర్యలు ఉంటాయని తెలియజేశారు. సమస్యలు ఏమైనా ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. గ్రామంలో ప్రత్యేక పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



గురజాల : ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) అన్నారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ చేసిన జమ్మిగుంపుల రామారావుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ధర్మాన్ని పాటించి పిల్లలను ఉన్నత స్థాయికి ఎదిగేలా రామారావు కృషి చేసారన్నారు. అదే విధంగా గురజాలలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బజారు బ్రాంచ్‌లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న గంగవరపు జయశేఖర్ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ సిబ్బంది, బంధువులు జయశేఖర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని బుజ్జి, పాఠశాల చైర్మన్ జమ్మిగుంపుల రమేష్, మన్నెం గురవయ్య తదితరులున్నారు.

రాజుపాలెం విద్యార్థినికి నవోదయలో సీటు



రాజుపాలెం: స్థానిక నవోదయ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న జల్లిపల్లి శ్రావ్య జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో సీటు సాధించింది. మద్దిరాలలోని జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి గాను ఇటీవల రాసిన పరీక్షలలో మెరుగైన మార్కులు సాధించి ప్రవేశం పొందింది. విద్యార్థినికి ఎంఈవోలు మల్లికార్జున శర్మ, నర్సింహారావు, ప్రిన్సిపాల్ పత్తి రామారావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కరుణామయుని పునరుత్థాన మహోత్సవం

- పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవ విశ్వాసులు



కానుకమాత చర్చి ఆవరణలో ఏసు పునరుత్థానం ఆవిష్కరిస్తున్న రె.ఫాదర్ గోవిందు రాయన్న

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి ఆవరణలో శనివారం అర్ధరాత్రి ఏసుక్రీస్తు పునరుత్థాన మహోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక సమిష్టి దివ్యపూజాబలిలో వేలదిమంది భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలను జరుపుకున్నారు. విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి ఆధ్వర్యంలో రె.ఫాదర్ గోవిందు రాయన్న ఈస్టర్ ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. ఏసుక్రీస్తు మరణించిన 3వ రోజు సజీవుడైనారని దీనిని పురస్కరించుకుని ప్రతి ఏటా ఈస్టర్ పర్వదినాన్ని ప్రపంచ కథోలిక సంఘం ఘనంగా జరుపుకుంటున్నారన్నారు. భారీగా బాణసంచా కాల్చగా, పూజబలిలో పాల్గొన్న భక్తులు కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తు పునరుత్థానను ఘనంగా స్వాగతించారు. అనంతరం ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సమిష్టి దివ్యపూజాబలిలో రె.ఫాదర్లు ఏరువ బాల శౌర్రెడ్డి, ఎస్. పీటర్ పాపయ్య, సహాయక గురువులు అగస్టీన్, బ్రదర్ అనిల్ తేజ, మఠకన్యలు, చర్చి పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కారెంపూడిలో ఘనంగా ఈస్టర్ వేడుకలు

కారెంపూడి: మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న పలు చర్చిలలో ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కారెంపూడి సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో పాస్టర్ డాక్టర్ ఎం.మాణిక్యాలరావు, పాస్టర్ ప్రదీప్ ఈస్టర్ పండుగ వాక్యాన్ని బోధించారు. యువజనులు తమ ఆట పాటలతో అలాగే సండే స్కూల్ పిల్లలు నృత్య ప్రదర్శనలతో అలరించారు. సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, డెలిగేట్ మెంబర్స్, సంఘాల సభ్యులు తదితరులు ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పునరుత్థానం చెందిన దైవ కుమారుడు ఏసు క్రీస్తు

రెంటచింతల: ప్రపంచ మానావళిని పాపముల నుంచి రక్షించుటకై రక్తం చిందించి సిలువ మరణం పొందిన యెహోవాదేవుని కుమారుడైన ఏసుక్రీస్తు మూడవరోజు సజీవుడై పునరుత్థానాన్ని పురస్కరించుకుని కథోలికులు ఈస్టర్ వేడుకలను జరుపుకుంటారని కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ వైఎల్ మర్రెడ్డి అన్నారు. స్థానిక కానుకమాత చర్చిలో ఆదివారం ఏసుక్రీస్తు పునరుత్థాన మహోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక సమిష్టి దివ్యపూజాబలిలో రె.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఏసు క్రీస్తు మరణించిన 3వ రోజు సజీవుడై పునరుత్థానం చెందగా ఆయన త్యాగానికి, స్వచ్ఛతకు ప్రతీకగా ప్రతి ఏటా ఈస్టర్ పర్వదినాన్ని కథోలికులు ఘనంగా జరుపుకుంటున్నారన్నారు. ఈ సమిష్టి దివ్యపూజాబలిలో సహాయక గురువులు ఫాదర్ అగస్టీన్, బ్రదర్ నిఖిల్ తేజ, మఠకన్యలు, చర్చి పెద్దలు పాల్గొన్నారు. స్థానిక ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో ఆదివారం భక్తులనుద్దేసించి పాస్టర్ కటికల ఏసుదానం భక్తులకు వాక్యం అందించారు. క్రీస్తు సూక్తులను ఆచరించి తోటి వారి పట్ల ప్రేమ, కరుణ, దయ చూపించాలని కోరారు. మండలంలోని వివిధ చర్చిలు, ప్రార్థనా మందిరాలలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించి భక్తులకు ఈస్టర్ విశిష్టతను వివరించారు. ఉదయం ఫాదర్లు, బ్రదర్లు, డీకన్లు గ్రామంలోని ప్రతి కథోలికుల గృహాలను, షాపులను సందర్శించి అభిషేకించిన తీర్థ జలంతో ఆశీర్వదించి కుటుంబ ప్రార్థనలు నిర్వహించారు.



గురజాలలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో ఈస్టర్ ప్రార్థనల్లో భక్తులు



మాచర్లలోని చర్చిలో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవ సోదరులు

గురజాలలో ఘనంగా ఈస్టర్ వేడుకలు

గురజాల: మండలంలోని చర్చిలలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుడ్ ఫ్రైడే అనంతరం వచ్చే ఆదివారం ఈస్టర్ పండుగను క్రైస్తవులు జరుపుకుంటారు. ఆదివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈస్టర్ పండుగను ఉద్దేశించి మత పెద్దలు ప్రసంగించారు. అనంతరం దేవుని వాక్యములను బోధించి దేవుని మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఆకాంక్షించారు.

మాచవరంలో ఈస్టర్ వేడుకలు

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఈస్టర్ పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవులు తెల్లవారు జామునే తమ పితరుల సమాధుల వద్దకు చేరుకొని ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేపట్టారు. ఆయా గ్రామాల్లోని చర్చిలలో పాస్టర్లు ప్రత్యేక ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు దైవ వాక్యాన్ని తెలియజేస్తూ ఏసుక్రీస్తు సర్వమానవాళిని పాపముల నుంచి రక్షించుటకై సిలువలో మరణించాడని, లేఖనముల నెరవేరు ప్రకారము తిరిగి మూడవ దినమున లేచెనని తెలియజేశారు. ప్రతి ఒక్కరు ఆయన చూపిన సన్మార్గంలో నడిచి కృపా క్షేమములు పొందాలని తెలిపారు.



కేసానపల్లి లూథరన్ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ ప్రసన్నకుమార్



ఈస్టర్ ఆరాధనకు హాజరైన విశ్వాసులు

ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనల్లో పీవీఆర్



మాచర్ల: ఈస్టర్ పండుగ రోజు ఏసు ప్రభువును స్తుతిస్తూ ప్రార్థన చేయటం ద్వారా ప్రభువు ఆశీస్సులు పొందవచ్చునని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం సుద్దగుంతలలోని హోసన్న ప్రార్థన మందిరంలో ఈస్టర్ పండుగ సందర్భంగా చర్చి పాస్టర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. పీవీఆర్‌కు చర్చి పాస్టర్, సంఘ పెద్దలు ఆశీస్సులందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, చర్చి సంఘ పెద్దలు పలువురు పాల్గొన్నారు.

మారుమనస్సు కలిగి జీవించాలి

దాచేపల్లి : పాప జీవితానికి స్వస్తి చెప్పి మారుమనస్సు కలిగి పరిశుద్ధంగా జీవించాలని పాస్టర్ జీఎస్ ప్రసన్నకుమార్ అన్నారు. మండల వ్యాప్తంగా ఈస్టర్ పండుగ వేడుకలు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు సిలువ మరణం పొంది పునరుత్థానుడై సమాధి నుంచి తిరిగిలేచిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ సమాధుల తోటల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేసానుపల్లి లూథరన్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాస్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ...క్రీస్తు పునరుత్థానం ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగునిస్తుందని, సర్వ మానవాళి సత్ప్రవర్తనతో జీవించాలన్నారు. ఈ ప్రార్థనల్లో పాస్టర్లు యామర్తి సురేష్, కేఎస్ డేవిడ్‌రాజు, మాచర్ల మోజేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాచర్లలో ఘనంగా ఈస్టర్ పండుగ

మాచర్ల: పట్టణంలోని ఆయా చర్చిల్లో ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని 70 చర్చిల్లో ఆయా చర్చి పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేసిన క్రైస్తవులు ఈస్టర్ పండుగను ప్రత్యేకంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు పునరుత్థానం గురించి సందేశాలిస్తూ ప్రార్థనలు చేశారు. పట్టణంలోని లూథరన్ చర్చిలో పశ్చిమ సినడ్ బిషప్ చాట్ల ఐజయ్య, డేవిడ్ రాజు, మార్టిన్, జీవన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదే విధంగా తెలుగు బాప్టిస్టు చర్చి సంఘ కాపరి రెవ.రవికుమార్, సంఘ పెద్దలు మాచర్ల నాగేశ్వరరావు, పెద్ద ఏసోబు, కందుల యోహాను, మాచర్ల దేవానంద్, చిన్న కోటి, విజయ్‌భాస్కర్, వాసు ఆధ్వర్యంలో క్రీస్తును స్తుతించారు. ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ది లెమెన్ ఇవాంజలికల్ చర్చి, కేసీపీ రహదారిలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి నూతనంగా బాప్తిజంను పలువురు స్వీకరించగా ఆయన వారికి ఆశీస్సులందించి ప్రార్థన చేశారు. 20వ వార్డులోని బేతేలు మందిరంలో జాన్ వెస్లీ, క్రైస్తవుల ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు బోధనల గురించి వివరించారు. 10వ వార్డులోని జేబీపీఎఫ్ చర్చి పాస్టర్ బ్రహ్మనాయుడు, మరనాత చర్చి, పెంతెకోస్తు, 24వ వార్డులో పాస్టర్ ఎలీషా ఆధ్వర్యంలో రోప్‌వే కాలనీ దగ్గర అపోస్తులిక్ ఫైయర్ ఫెలోషిప్ చర్చి ఫాదర్, సంఘ పెద్ద, కౌన్సిలర్ మందా సంతోష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సెరిన్ కాలనీలో పాస్టర్ వేల్పుల దానియేలు, వినాయకుని గుట్టలో పాస్టర్ వేల్పుల గురవయ్య, 9వ వార్డులోని చర్చిలో పాస్టర్ ప్రవీణ్‌కుమార్, పట్టణంలోని షాలోం మందిరంలో పాస్టర్ అభిషేక్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగను ఘనంగా జరిపారు. క్రీస్తును కీర్తిస్తూ, ప్రత్యేక ప్రార్థనలతో పాటు ఆరాధన కార్యక్రమం నిర్వహించారు.



లూథరన్ చర్చిలో..



తెలుగు బాప్టిస్టు చర్చిలో..



అపోస్తుల చర్చిలో..



ఆర్‌సీఎం చర్చిలో బాప్టిజం స్వీకరిస్తున్న దృశ్యం

అభివృద్ధిని మళ్లీ గెలిపించండి



పట్టణంలోని 18 వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పట్టణంలోని హోసన్న మందిరంలో ఈస్టర్ ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: పట్టణంలో ప్రతి ఇంటికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందాయని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో ఆదివారం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రహదారి వెడల్పు, బైపాస్ రోడ్డు పూర్తి చేసి శాశ్వతంగా ట్రాఫిక్ సమస్యను నిర్మూలించాం అన్నారు. 75 సంవత్సరాలుగా మంచి నీటికి ఇబ్బందులు పడుతున్న పట్టణంలో ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందిస్తున్నాం అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మించి ప్రజలకు వైద్యం అందిస్తున్నాం అన్నారు. అభివృద్ధిని చూసి ప్రతి ఒక్కరు వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించాలని కోరారు. అప్పుడు అభివృద్ధిని మళ్లీ పరుగులు పెట్టిస్తాం అన్నారు. ముందుగా షిరిడీ సాయి బాబా గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వార్డులో సందర్శించి ప్రముఖులతో చర్చించారు.

ఈస్టర్ వేడుకల్లో ఎమ్మెల్యే కాసు..

పట్టణంలోని పలు చర్చిలో జరిగిన ఈస్టర్ పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. చర్చి ఫాదర్లు ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డిని ఘనంగా స్వాగతించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు జరుపుకునే వేడుకల్లో ఈస్టర్ ఒకటి అన్నారు. మరణించిన ఏసు క్రీస్తు పునరుత్థానం పొందిన రోజుని, అందుకే క్రైస్తవులు ఎంతో సంతోషంగా ఈస్టర్ పండుగను జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా చర్చి ఫాదర్లు, వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యాకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

టీడీపీ నుంచి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేరికలు..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని చూసి టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఆదివారం పలువురు చేరారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కరాలపాడు సర్పంచ్ చల్లా శివారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో కరాలపాడు గ్రామానికి చెందిన టీడీపీలో బలమైన నాయకులు నూకాబత్తిన పెద్ద శివ, నూకాబత్తిన చిన శివ, పులివెలుగు సాగర్, పంద్రాజు లక్ష్మీనారాయణలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పార్టీ కండువాలను కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించి, పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాలపాడు సర్పంచ్ చల్లా శివారెడ్డి, ఎంపీటీసీ అనబోతుల గురవారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తార్ సీతారామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దెసిరెడ్డి సంజీవరెడ్డి, నూకాబత్తిన ముసలయ్య, కోటా కిరణ్, నూకాబత్తిన ప్రభుదాస్, నూకాబత్తిన రమేష్, ఎస్. సాంబయ్య, శంకర్, గుడిపూడి అరవింద్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యాకర్తలు పాల్గొన్నారు.

హోంగార్డు సుభానికి అభినందనలు



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద హోంగార్డు సుభాని ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అరబిందో ఫార్మా కంపెనీ ఆపరేషన్స్, ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రెసిడెంట్ పీ శ్రీనివాసరెడ్డి అభినందించారు. మండలంలోని దమ్మాలపాడు గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చిన శ్రీనివాసరెడ్డి హోంగార్డు సుభాని చలివేంద్రాన్ని సందర్శించి అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్న సుభానిని ఆదర్శంగా తీసుకొని సేవాభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కళ్ళం కోటిరెడ్డి, వీరారెడ్డి, మీరావలి స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కండ్లకుంటలో ఘనంగా అమ్మవారి తిరునాళ్ల



వెల్దుర్తి: మండలంలోని కండ్లకుంట గ్రామంలో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం గ్రామస్తులంతా ఆనందోత్సాహాల మధ్య ఆదివారం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. గ్రామాలలో జరుపుకునే తిరునాళ్లను గ్రామస్తులంతా ఐకమత్యంతో సంతోషంగా జరుపుకోవటం శుభపరిణామమన్నారు. ప్రతి ఏటా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవటం హర్షణీయమన్నారు. ముందుగా దేవాలయంలో ఆంజనేయ స్వామి, నాగేంద్ర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నెల్లి వెంకటలక్ష్మారెడ్డి, తంగిరాల శివారెడ్డి, ఈడెబోయిన వెంకయ్య, తంగిరాల రామిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగేంద్రస్వామి తిరునాళ్ల

సత్తెనపల్లి: మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో నాగేంద్రస్వామి వారి తిరునాళ్ల ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ట్యాంకర్లతో తాగునీరు పంపిణీ



రాజుపాలెం: తాగునీటి సమస్యను అరికట్టేందుకు వేసవి పూర్తయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని పంపిణీ చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని తెలిపారు. మండలంలోని కొండమోడు పరిధిలోని పార్వతీపురంలో తాగునీటి సమస్య ఉన్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. దీంతో ఆదివారం పార్వతీపురం చేరుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బోర్లు ఎండిపోయినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఏఈ భవాని మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సమస్యను అరికట్టేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో రెండు నీటి ట్యాంకుల ద్వారా తాగునీటి పంపిణీని ఆదివారం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. కొండమోడు, పార్వతీపురం ప్రాంతాలకు ఎక్కడ కొరత తలెత్తకుండా ఉచిత తాగునీటిని పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: కారెంపూడి శివారు ఆదినారాయణ కాలనీకి చెందిన పది ఎస్సీ కుటుంబాలు టీడీపీని వీడి ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు వారు సంతోషం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు మోసపూరిత వాగ్దానాలు నమ్మి మరోసారి మోసపోవడానికి తాము సిద్ధంగా లేమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అభినందనలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ పార్టీ గుర్తింపునిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ షేక్ షఫీ, పార్టీ నాయకులు బొమ్మిన అల్లయ్య, కొమ్ము చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, రమావతు తేజానాయక్, చింతల శ్రీనివాసరావు, మర్రి శేషయ్య, కాలె రాంబాబు, జొన్నలగడ్డ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్ వేడుకల్లో ప్రభుత్వ విప్ పీఆర్కే...

రెంటచింతల: మరణాన్ని జయించిన దైవ కుమారుడు ఏసుక్రీస్తు ఒక్కరేనని.. మానవాళి పాపాలకు తనను తాను సిలువ మరణం ద్వారా ప్రాణత్యాగం చేసి పునరుత్థానం పొందారని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఈస్టర్ పండుగ సందర్భంగా దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి షాపులో ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని మాట్లాడారు. ఏసుక్రీస్తు పునరుత్థానం క్రైస్తవ చరిత్రలో ఒక కీలకమైన ఘటనగా పేర్కొన్నారు. ఈస్టర్ క్రైస్తవులకు ఆధ్యాత్మికమైన ప్రాముఖ్యతను కలిగి ఏసుక్రీస్తు ప్రేమ, త్యాగం, మోక్షానికి సంబంధించిన వేడుక అన్నారు. అనంతరం పులిహోర పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేర్ల చౌడమ్మ, మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్ రెడ్డి, ఎంపీటీసీ గాలి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఏరువ ప్రమీల విజయభాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు ఏరువ ప్రతాప్‌రెడ్డి, గంజి బాలరెడ్డి, గాదె కిరీటిరెడ్డి, పేర్ల ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



రెంటచింతలలో ప్రత్యేక ప్రార్థనల్లో ప్రభుత్వ విప్ పీఆర్కే